సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్‌ నంబర్‌కు వాట్సాప్‌ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న బాబా

విశాఖ విద్య : జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీ శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో బాబాకి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం బాబాకి ప్రత్యేక హారతులిచ్చారు. సాయి సంకీర్తనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పల్లకీ సేవ వైభవోపేతంగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన


కిట్‌ అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్‌

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై గురువారం అవగాహన కల్పించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్‌ పాల్గొని మాట్లాడారు. అనంతరం విశ్వకర్మ కిట్స్‌ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, జోనల్‌ కమిషనర్‌ రాము, 56, 63 వార్డు కార్పొరేటర్లు రాజుశేఖర్‌, చిన్న, 57వ వార్డు వార్డు అధ్యక్షుడు పెంటకోట ఆజయ్‌ బాబు, జోనల్‌ అధికారులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం


మహిళను ఆస్పత్రికి తీసుకెళ్తున్న మమత

విశాఖ విద్య: మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళకు జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ షెల్టర్‌ మేనేజర్‌ ఎల్లేటి మమత ఆధ్వర్యంలో ఆశ్రయం కల్పించారు. రైల్వేస్టేషన్‌లో రెండు రోజుల నుంచి వర్షంలో మహిళ తడుస్తూ ఉండడం గమనించిన రైల్వే పోలీసుల షెల్టర్‌ మేనేజర్‌ ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. ఆమె అక్కడకు వెళ్లి వివరాలు ఆరా తీసే ప్రయత్నం చేశారు. మానసిక పరిస్థితి బాగోకపోవడంతో వివరాలు ఏమీ చెప్పలేకపోయింది. మేనేజర్‌ మమత, రైల్వే కానిస్టేబుల్‌ అనిత ఆమెను చికిత్స నిమిత్తం మానసిక వైద్యశాలలో చేర్పించారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


దుర్గాదేవిని దర్శించుకున్న భోగవల్లి నాగభూషణం తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం శెట్టిబలిజ వీధిలో స్థానిక శారదా శెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో శరన్నరాత్రి పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దుర్గాదేవిని ఎమ్మెల్యే పి.గణబాబు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి సోమేష్‌,కాకి పాలిరెడ్డి పాల్గొన్నారు. అలాగే మల్కాపురం గ్రామం అభివృద్ధి సంఘం ప్రతినిధులు భోగవల్లి నాగభూషణం,సత్యాల మహేష్‌, ఉరుకూటి బాబూరావుయాదవ్‌ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్‌ వెస్ట్‌
8978872250

ముంచెత్తిన వాన


జీవీఎంసీ 63వ వార్డులో జలమయమైన రోడ్డు


మల్కాపురం ప్రాంతంలో కురుస్తున్న వర్షం

సింధియా: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో రెండు రోజులుగా వర్షం దంచికొడుతోంది. బుధవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. ఉరుములు, పిడుగులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గురువారం ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉద్యోగులు, కార్మికులు విధులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లు జలమయం కావడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు.లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ప్రధానంగా పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీహరిపురం, మల్కాపురం, సింధియా ప్రాంతంలో రోడ్లన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. వర్షం వల్ల ప్రజలు బయటకు రాకపోవడంతో వ్యాపార సంస్థలు వినియోగదారులు లేక వెలవెలబోయాయి.ఫుట్‌పాత్‌ వ్యాపారులు దుకాణాలు తెరవలేదు.

- జలమయమైన రోడ్లు


వర్షంలో తడిచిపోతున్న కూరగాయల వ్యాపారులు

మరోపక్క తుపాను హెచ్చరికలతో పారిశ్రామిక ప్రాంతంలోని కొండవాలు ప్రాంత ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.బిక్కు బిక్కుమంటూ గడిపారు.

పారిశ్రామిక ప్రాంతంలో భారీ వర్షం

మల్కాపురం : తుపాన్‌ కారణంగా పారిశ్రామిక ప్రాంతంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పారిశ్రామిక ప్రాంతంలో పలు సేవా మార్గాలు తడిసిముద్దయ్యాయి. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంలో తడుస్తూనే కూరగాయలు విక్రయించారు. విద్యార్థులు స్కూళ్లకు వెళ్లేందుకు వర్షంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తప్పనిసరి పరిస్థితుల్లో గొడుగుల సాయంతో స్కూళ్లకు వెళ్లారు.


వర్షంలో గొడుగుల సాయంతో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

చదువుల తల్లి.. ఈ డాక్టర్‌


అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్‌ అందుకుంటున్న డాక్టర్‌ నాగరత్న అమృత (ఫైల్‌)

- పరీక్ష ఏదైనా టార్గెట్‌ టాపర్‌
- ఐదు బంగారు పతకాలు కైవసం
- వెల్లువెత్తిన అభినందనలు

మల్కాపురం: కష్టపడితే సాధ్యం కానిది ఏదీ లేదు. కష్టే ఫలి అన్న సూత్రాన్ని తాను గట్టిగా నమ్ముతానని డాక్టర్‌ చెక్క నాగరత్న అమృత అంటున్నారు. తన చిన్న నాటి కల అయిన ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. అందులో కూడా టాపర్‌గా నిలిచి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం కేజీహెచ్‌లో హౌస్‌ సర్జన్‌గా పని చేస్తున్న జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన డాక్టర్‌ అమృత విజయగాథ ఇదీ.

ప్రాథమిక విద్య నుంచి టాపరే..

నౌసేనాబాగ్‌ కేంద్రియ విద్యాలయంలో అమృత 1 నుంచి 10 వరకు చదివారు. 2017లో టెన్త్‌ పూర్తి చేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రణాళిక బద్ధంగా చదువుతూ ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్‌లో కూడా టాపర్‌గా నిలిచారు. 2019లో జరిగిన నీట్‌ పరీక్షల్లో 262 మార్కులు సాధించి స్టేట్‌ ర్యాంక్‌ సాధించింది. దీంతో అమృతకు ఆంధ్రమెడికల్‌ కళాశాలలో మెడికల్‌ సీట్‌ వచ్చింది. నాలుగేళ్లు టాపర్‌గా నిలిచి అందరి ప్రశంసలు అందుకుంది.

అవార్డుల పంట

- మెడికల్‌ ఫస్ట్‌ ఇయిర్‌లో ఆంధ్ర మెడికల్‌ కళాశాల టాపర్‌గా నిలిచి బంగారు పతకం అందుకున్నారు. అదే సంవత్సరం అనాటమీలో డాక్టర్‌ కె.సంజీవ్‌రావు మెమోరియల్‌ (గోల్డ్‌ మెడల్‌)ప్రైజ్‌ సాధించింది.
- ఫైనల్‌ ఇయర్‌లో డాక్టర్‌ వెంపాటి రమణనర్సింహం మెడికల్‌ ఇన్‌ జరల్‌ మెడిసన్‌లో కూడా అమృత బంగారు పతకం సాధించింది.
- మానవ శరీరంపై నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచి.. ఇక్కడ కూడా బంగారు పతకం అందుకున్నారు.
- డాక్టర్‌ బోగరాజు రమణమూర్తి మెమోరియల్‌ ప్రైజ్‌ పీడీయాట్రిక్స్‌ (పుట్టిన పిల్లల నుంచి యవ్వనంలో ఉన్న బాలికలకు వైద్యం అందించే విభాగం)లో చక్కటి ప్రతిభ చూపి మరలా బంగారు పతకం అందుకుంది.

తల్లిదండ్రుల నేపథ్యం ఇదీ

అమృత తండ్రి చెక్క రామకృష్ణ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అధికారి. తల్లి ఆదిలక్ష్మి హెచ్‌పీసీఎల్‌ (విశాఖ రిఫైనరీ)లో ఉద్యోగి. వీరిద్దరికీ ఒకే ఒక్క సంతానం అమృత.

జనరల్‌ మెడిసిన్‌లో పీజీ చేస్తా..



తల్లిదండ్రుల సూచనలతో చిన్న తనం నుంచి ఒక లక్ష్యం పెట్టుకుని ప్రణాళిక ప్రకారం చదివాను. అనుకున్న ప్రకారం మెడికల్‌ సీటు సాధించాను. ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలో జనరల్‌ మెడిసిన్‌(పీజీ) చదవాలన్నది నా లక్ష్యం. పేద రోగులకు నా వంతు సేవ చేస్తాను. ప్రస్తుతం కేజీహెచ్‌లో హౌస్‌సర్జన్‌గా చేస్తున్నాను.

డాక్టర్‌, నాగరత్న అమృత

రాజకీయ కక్షతో రౌడీషీట్‌ ఓపెన్‌ చేశారు

- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివరించిన కార్పొరేటర్‌ పీవీ సురేష్‌
- అండగా ఉండి ఆదుకుంటామని వైఎస్‌ జగన్‌ భరోసా


మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితో 60వ వార్డు కార్పొరేటర్‌ పీవీ సురేష్‌, దొడ్డి కిరణ్‌

మల్కాపురం: వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్‌ పీవీ సురేష్‌ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం తనపై అక్రమంగా రౌడీషీట్‌ ఓపెన్‌ చేసి రాజకీయంగా దెబ్బకొట్టాలని చూస్తుందని కార్పొరేటర్‌ సురేష్‌ వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ప్రభుత్వ పథకాలు సరిగ్గా చేరడంలేదని, ఎన్నికల హామీలను విస్మరించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేయడమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దీనిపై స్పందించిన జగన్‌హన్‌రెడ్డి రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకే కాకుండా ప్రజలందరికీ అండగా ఉండి.. వారి తరపున ప్రభుత్వంతో పోరాడుతామని భరోసా కల్పించారని కార్పొరేటర్‌ పీవీ సురేష్‌ తెలిపారు. సురేష్‌తో పాటు జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో 89వ వార్డు నాయకుడు దొడ్డి కిరణ్‌ ఉన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


నివాళులర్పిస్తున్న డీటీసీ ఆదినారాయణ

విశాఖ విద్య : ఉప రవాణా కమిషనర్‌ కార్యాలయంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి డీటీసీ జి.ఆదినారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్టీవో ఆర్‌సీహెచ్‌ శ్రీనివాస్‌, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం



రైతు బజార్‌ ముందు ధర్నా చేస్తున్న నాయకులు

విశాఖ విద్య : అధిక ధరలు నియంత్రించడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిరశనగా సీపీఐ ఆధ్వర్యంలో గోపాలపట్నం రైతుబజార్‌ ముందు గురువారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా నాయకుడు ఆర్‌.శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయన్నారు. సామాన్య ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. దళారీ వ్యవస్థను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ప్రకటించి... అధికారం చేపట్టిన తర్వాత హామీలు నెరవేర్చకుండా నిత్యావసర సరకుల ధరలు అమాంతం పెంచి ప్రజలపై పెను భారం మోపుతున్నారని మండిపడ్డారు. సీపీఐ జిల్లా నాయకులు వై.రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి మద్యం దుకాణాల నిర్వహణపై ఉన్న ఆసక్తి నిత్యావసర సరకుల ధరల నియంత్రణపై లేదన్నారు. ఒక వైపు ఇసుక పాలసీతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. లేకపోతే ప్రజా ఉద్యమంగా మలిచి ప్రభుత్వ పునాదులు కదిలిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, ఎస్‌.అసిరి నాయుడు, అరుణ, రాము, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన


మళ్ల సూరి వీధిలో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న విద్యుత్‌ శాఖాధికారులు

సాక్షి ఎఫెక్ట్‌..

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి మళ్ల సూరి వీధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారంటూ స్థానికుల ఫిర్యాదుతో 'పబ్లిక్‌ రోడ్లపై ప్రైవేట్‌ ట్రాన్స్‌ఫార్మర్లు' శీర్షికతో ఈ నెల 15న సాక్షి పత్రికలో ఓ కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన కంచరపాలెం జోన్‌ – 2 ఏపీఈపీడీసీఎల్‌ ఈఈ బీకే నాయుడు ఆదేశాల మేరకు ఏడీఈ శివ కోటేశ్వరరావు, ఏఈ ఎల్‌డీ ప్రసాద్‌ గురువారం పరిశీలించారు. స్థానిక భవన నిర్మాణ బిల్డర్లతో మాట్లాడి డాక్యుమెంట్లు పరిశీలించారు. అపార్ట్‌మెంట్‌ సెల్లార్లకు ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో స్థానికులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

దేశాభివృద్ధిలో యువత ప్రధాన పాత్ర పోషించాలి


మాట్లాడుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ మంజుల

అల్లిపురం: దేశాభివృద్ధిలో యువత ప్రధాన పాత్ర పోషించాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్‌) ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఆర్‌.మంజుల అన్నారు. ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ సెల్‌, కెరియర్‌ గైడెన్స్‌ సెల్‌, జవహర్‌ నాలెడ్జ్‌ సెంటర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ సంయుక్తంగా గురువారం కళాశాలలో నిర్వహించిన వికసిత్‌ భారత్‌–2047, ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ కెరీర్‌ గైడెన్స్‌ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన జాబితాలో ఉండాలంటే యువత ప్రధాన పాత్ర పోషించాలన్నారు. వారి ఆలోచనలు ఆచరణలో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్‌ బి.సంతోషి అనూష, ఉమెన్‌ ఎంపవర్‌మెంట్‌ కన్వీనర్‌ ఎస్‌.అనురాధ, జే.సునీత, విద్యాకల్పన, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో అంధకారం

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లోని శ్రీకృష్ణ మందిర్‌ సమీపంలో వీధిలైట్లు వెలగకపోవడంతో అంధకారం అలముకుంటుంది. మరో వైపు చీకటి పడితే తేలు, జెర్రిలు, పాములు తదితర విషకీటకాలు సంచారం అధికంగా ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. రాత్రి పూట వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తుందని వాపోతున్నారు. పలుమార్లు విద్యుత్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యువతతోనే మత్తు పదార్థాల కట్టడి


మాట్లాడుతున్న జిల్లా యువజన అధికారి ఉమా మహేశ్వరరావు

బీచ్‌రోడ్డు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జిల్లా యువజన అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం బీచ్‌ రోడ్డు యూత్‌ హాస్టల్‌లో మత్తు పదార్థాల వ్యసనం, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పెడదారులు పట్టి, సాంఘిక దురాచారాలతో, నేర ప్రవృత్తి కలిగి ఉంటోందన్నారు. దీనిని కట్టడి చేయడంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. మూడో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌ఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల యువత మత్తు పదార్థాలు సేవించి వివిధ నేరాల్లో పాల్గొంటున్నట్లుగా కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ విధమైన నేరాలను అరికట్టడంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమిధ-ఐ.డి.యు. ప్రాజెక్ట్‌ వి.రవికుమార్‌, ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌ పి.రవికుమార్‌, వలంటీర్‌ హెల్త్‌ సర్వీసెస్‌ ఆర్గనైజేషన్‌ ప్రతినిధి కె.సురేష్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐదో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిశీలన

పరిశుభ్రత లేకపోవడంతో డీసీపీ – 2 మేరీ ప్రశాంతి అసంతృప్తి


రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ - 2 మేరీ ప్రశాంతి

మర్రిపాలెం : కంచరపాలెంలోని ఐదో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ను డీసీపీ – 2 మేరీ ప్రశాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె తొలిసారిగా స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడి పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వచ్చే సమయానికి సీఐ చంద్ర శేఖర్‌ స్టేషన్‌లో లేకపోవడం, కోడిపుంజుల అరుపులు, వాటి వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఆమె స్టేషన్‌ నుంచి బయటకు వచ్చేశారు. కొద్దిసేపటి తర్వాత స్టేషన్‌కు వచ్చిన సీఐతో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. స్టేషన్‌లో అధిక సంఖ్యలో ఫిర్యాదుదారులు ఉండడంపై ఆమె ఆరా తీశారు. ఎందుకు గంటల తరబడి వారిని ఉంచుతున్నారని, త్వరితగతిన ఫిర్యాదులు స్వీకరించి పంపించాలని సూచించారు. అనంతరం పలు దస్త్రాలు పరిశీలించారు. హనీట్రాప్‌, పలు పెండింగ్‌ కేసుల పురోగతిపై ఆరా తీశారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న రమణ

విశాఖ విద్య : అనాథ మృతదేహానికి జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్‌ బొమ్మిడి రమణ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎన్‌ఏడీ ఆల్ఫా హోటల్‌ ఎదురుగా ఫ్లై ఓవర్‌ కింద 38 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడని ఎయిర్‌పోర్టు జోన్‌ పోలీసులకు సమాచారం అందింది. మృతుడికి సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో అనాథగా నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న 90వ వార్డు కార్పొరేటర్‌ బొమ్మిడి రమణ మానవతా దృక్పథంతో ముందుకొచ్చి హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు జోన్‌ కానిస్టేబుల్‌ శివ సాగర్‌, పోతల సతీష్‌, నరసింహ, సాయి పాల్గొన్నారు.

గెడ్డల్లో పూడిక తొలగింపు


దుర్గానగర్‌ గెడ్డలో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రైల్వే ట్రాక్‌ రహదారికి ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డల్లో గురువారం పూడిక తొలగించారు. గొల్ల కంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్‌, గోకుల్‌ నగర్‌ తదితర ప్రాంతాల్లోని గెడ్డల్లో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ జె.రమేష్‌ పర్యవేక్షణలో జేసీబీ సహాయంతో పూడిక తొలగించి, వ్యాన్లు సహాయంతో వెంటనే తరలించారు. ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా పూడిక తొలగించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌ తెలిపారు. గెడ్డల్లో చెత్త వేయకుండా క్లాప్‌ వాహనాలకు అందించాలని ఆయన కోరారు.

ఆస్పత్రిని పోర్టు యాజమాన్యమే నిర్వహించాలి

జోరువానలోనూ ఆగని నిరాహారదీక్షలు


పోర్టు ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలో ఐఎన్‌టీయూసీ నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్‌ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 17వ రోజుకు చేరాయి. జోరువానలో సైతం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగించారు. ఈ సందర్భంగా యూనియన్‌ నాయకుడు గొర్లె చందు మాట్లాడుతూ పోర్టులో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది కార్మికులు, విశ్రాంత పోర్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పోర్టు హాస్పిటల్‌ సేవలు పొందుతున్నారన్నారు. అటువంటి ఆస్పత్రిని ప్రైవేటీకరించాలని చూడడం దారుణమన్నారు. పీపీపీ మోడ్‌లో ప్రైవేట్‌ వ్యక్తులకు అప్పగించేందుకు టెండర్లు పిలుస్తున్నారని, అందుకు వ్యతిరేకంగా పోర్టులో ఉన్న ఆరు ఫెడరేషన్లు రిలే నిరాహారదీక్షల ద్వారా ఉద్యమిస్తున్నాయని తెలిపారు. ఇప్పటి వరకూ పోర్టులో పీపీపీ ద్వారా ప్రైవేటు వ్యక్తులకిచ్చినవి ఏవీ సత్ఫలితాలు ఇవ్వలేదన్నారు. లీజు పద్ధతిలో ప్రైవేటుకిచ్చిన పోర్టు స్టేడియం, కల్యాణ మండపాల వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఆస్పత్రిని పోర్టు సొంత నిధులతోనే నిర్వహించాలని, అలా కాదని ప్రైవేటు వ్యక్తులకిస్తే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలకు బీఎంఎస్‌ ప్రధాన కార్యదర్శి రవి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.సత్యనారాయణ, హెచ్‌ఎంఎస్‌ మంగయ్యనాయుడు మద్దతు తెలిపారు. గురుప్రసాద్‌, వెంకట్రావు, రమణ, సూర్యనారాయణ, రవి, ఒమ్మి అప్పారావు, సన్నిబాబు పాల్గొన్నారు.

18 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్‌ మారూఫ్‌, ఆర్పీఎఫ్‌ ఏఎస్‌ఐ ఎస్‌.చిట్టిబాబు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్‌ జిల్లాకు చెందిన బసవరాజ్‌ వడ్డర్‌ బ్యాగులు తనిఖీ చేయగా 18 కేజీల గంజాయి గుర్తించారు. గంజాయి సీజ్‌ చేసి, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్న జీఆర్పీ సిబ్బంది రిమాండ్‌ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్‌ వెస్ట్‌
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com